
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
గురువారం 7 ఆగస్టు 2025



ఇందిరమ్మ ఇల్లు రాలేదని..

- యువకుడి ఆత్మహత్యాయత్నం
- బాధితుడితో మాట్లాడిన తహసీల్దార్

7



సంగారెడ్డి పట్టణంలోని జగ్గారెడ్డి ఇంట్లో ఆయన తనయ జయారెడ్డి పెళ్లి కూతురు వేడుకలో స్థానికులు



జయారెడ్డితో జగ్గారెడ్డి, నిర్మల, దత్తసాయిరెడ్డి, కుసుమకుమార్

రామ్‌మందిర్‌లో నేడే జయారెడ్డి వివాహ వేడుక

- పెళ్లికూతురుని చేయడానికి తరలివచ్చిన జగ్గారెడ్డి శ్రేయోభిలాషులు, అభిమానులు

సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి : నేడు సంగారెడ్డి రాంనగర్‌లోని రామ్‌మందిర్‌లో నిర్వహించనున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూతురు జయారెడ్డి వివాహ వేడుకకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం రోజున జగ్గారెడ్డి ఇంటి వద్ద జయారెడ్డిని పెళ్లికూతురుగా ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డి శ్రేయోభిలాషులు, ఆయన అభిమానులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


- కలెక్టర్ హైమావతి
- కొండపాక మండలంలో ఆకస్మిక పర్యటన

కొండపాక/రాయపోల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని అందుకు ల్యాబ్‌లో పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ హైమావతి వైద్యసిబ్బందికి సూచించారు. కొండపాక పీహెచ్‌సీని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యసేవలను పరిశీలించారు. నోటిమాటతో సెలవు మంజూరు చేయవద్దని తప్పనిసరిగా లెటర్ పెట్టాలని డాక్టర్ శ్రీధర్‌ను ఆదేశించారు. మండలంలో ఆయుష్ డిపార్ట్‌మెంట్ చేస్తున్న కార్యక్రమాలపై డాక్టర్ రజనీని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ బయట గ్రామపంచాయతీ వర్కర్స్‌తో శుభ్రం చేయించుకోవాలని చెప్పారు.

భూభారతి సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిశీలించి పూర్తి చేయాలని కలెక్టర్ హైమావతి పేర్కొన్నారు. బుధవారం రాయపోల్‌లోని ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. నిర్మాణంలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఎరువుల దుకాణాలను పరిశీలించి అక్కడే ఉన్న రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణమోహన్, ఎంపీడీవో బాలయ్య, ఎంపీవో శ్రీనివాస్, వ్యవసాయ అధికారి నరేష్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.



కొండపాక : ఆసుపత్రి రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్



'అసెంబ్లీ' కంటే పెరిగిన ఓటర్లు

- 33,310 మంది ఓటర్లతో కొత్త జాబితా
- రిజర్వేషన్ల ప్రకటనకు ఆశావహుల ఎదురుచూపు

చేర్యాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్న నేపథ్యంలో, చేర్యాల మండలంలో ఓటరు జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఓటరు జాబితాలో కచ్చితత్వం, సమగ్రత, పారదర్శకత కోసం ప్రత్యేక సమగ్ర సవరణ - 2026 కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం తుది దశకు చేరుకుంది. మరో రెండు రోజుల్లో పూర్తిస్థాయి జాబితా సిద్ధం కానుంది. ఈ కొత్త జాబితా ప్రకారం జిల్లా, మండల ప్రాదేశిక, గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు.

గతంలో చేర్యాల మండలంలో 18 గ్రామాలు ఉండగా, ఇటీవల మద్దూరు మండలం నుంచి అర్జునపట్ల, కమలాయపల్లి గ్రామాలు విలీనం కావడంతో మొత్తం గ్రామాల సంఖ్య 20 పెరిగింది. దీంతో ఎంపీటీసీ స్థానాలు 11 నుంచి 12కు, గ్రామ పంచాయతీలు, వార్డు సభ్యుల స్థానాలు 184కు చేరాయి. ఇక గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేర్యాల మండలంలో 28,184 మంది ఓటర్లు ఉండేవారు. కొత్తగా ఓటర్ల నమోదు, సవరణ తర్వాత జూలై 1వ తేదీ నాటికి ఓటర్ల సంఖ్య 33,310కి పెరిగింది. వీరిలో 16,430 మంది పురుషులు, 16,880 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఓటరు జాబితాలో తప్పులను సవరించే పనిని అధికారులు పూర్తి చేస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓట్లు వేర్వేరు వార్డులలో నమోదవడం, ఒక వార్డులోని ఓటర్లు వేరే పోలింగ్ బూత్‌లలో చేర్చడం వంటి తప్పులను సరిచేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలను కూడా పునర్వ్యవస్థీకరిస్తున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1200మందికి మించి ఓటర్లు ఉండకూడదన్న నిబంధన మేరకు ఎంపీటీసీలకు సంబంధించి 61 పోలింగ్ బూత్‌లు, గ్రామ పం చాయతీ ఎన్నికలకు 85 పోలింగ్ బూత్‌ల జాబితాను సిద్ధం చేస్తున్నా రు. ఈ తరుణంలో ఎన్నికల సందడి మొదలైనా, రిజర్వేషన్ల ఖరారు కోసం ప్రభుత్వం చేసే ప్రకటన కోసం ఆశావాహులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రిజర్వేషన్లు ఎలా ఉంటాయోనని ఆలోచిస్తూనే, పలువురు పోటీకి సిద్ధమవుతూ ప్రజాక్షేత్రంలో అడుగులు వేస్తున్నారు. అదృష్టం ఎవరిని వరిస్తుందో చూడాలంటే ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

సోలార్ పవరే.. సో బెటర్

కొన్నేళ్లుగా ప్రతి నెలా రూ.లక్షల్లో వస్తున్న విద్యుత్ బిల్లు సిద్దిపేట మున్సిపాలిటీకి పెనుభారంగా మారింది. ఆ విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవడానికి సిద్దిపేట మున్సిపల్ సోలార్ పవర్‌పై దృష్టి సారించింది. ఇప్పటి వరకు ఇంటి అవసరాలకు, పరిశ్రమలకు మాత్రమే పరిమితమైన సోలార్ వ్యవస్థ... నేడు ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న సిద్దిపేట మున్సిపల్.. సోలార్ వినియోగం వల్ల విద్యుత్ బిల్లులు తగ్గితే, ఆ తగ్గిన మొత్తాన్ని అభివృద్ధి కోసం వినియోగించుకునేందుకు కసరత్తు చేస్తున్నది.

- సిద్దిపేట ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి)

- పైలెట్ ప్రాజెక్టుగా సిద్దిపేట మున్సిపాలిటీ
- ప్రతి నెలా రూ. 1,42,36,552 విద్యుత్ బిల్లులు చెల్లింపు
- భారం తగ్గించుకునే ప్రయత్నం
- పట్టణంలోని నాలుగు ప్రాంతాల్లో సోలార్ సిస్టమ్‌లు

సిద్దిపేటలోని 43 వార్డుల్లోని ప్రజలకు ప్రతిరోజూ కరీంనగర్ జిల్లా ఎల్ఎండీ నుంచి పంపింగ్ ద్వారా కమ్మర్లపల్లికి అక్కడి నుంచి పట్టణానికి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అలాగే మల్లన్నసాగర్ నుంచి కూడా తాగునీరు సరఫరా చేస్తున్నారు. కరీంనగర్ ఎల్ఎండీ నుంచి పంపింగ్ ద్వారా పట్టణంలోని ప్రజలకు అందిస్తున్న తాగునీటి కోసం సిద్దిపేట మున్సిపాలిటీ ప్రతి నెలా రూ.89.79 లక్షల మేర విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నది. కోమటిచెరువు అందాల కోసం ప్రతినెలా రూ.1.95 లక్షల మేర విద్యుత్ బిల్లులను చెల్లిస్తున్నది. వీటితో పాటగా పట్టణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు, ఎస్‌టీపీ ప్లాంట్లు, మిషన్ భగీరథ, బోర్ల వినియోగం, మున్సిపల్ కార్యాలయానికి బిల్లులను చెల్లిస్తూ ఆ భారాన్ని మోస్తున్నది. విద్యుత్ బిల్లుల భారాన్ని కొద్దిపాటిగా తగ్గించుకునేందుకు సిద్దిపేట మున్సిపల్ సోలార్ పవర్ పై దృష్టిసారించింది.

పైలెట్ ప్రాజెక్టుగా

సిద్దిపేటతో పాటు దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, గజ్వేల్‌లో మున్సిపాలిటీలున్నాయి. అయితే సిద్దిపేట మున్సిపల్‌లో చాలా ఏళ్లగా విద్యుత్ బిల్లుల సమస్య పెనుభారంగా మారింది. ప్రతినెలా రూ. కోటికి పైగా బిల్లు వస్తుండటంతో సిద్దిపేట మున్సిపల్ పట్టణంలోని పలుచోట్ల సోలార్ ప్లాంట్ పెట్టాలని నిర్ణయించుకంది ఈ మేరకు సోలార్ ఏజెన్సీని ఆశ్రయించింది. దాంతో ఏజెన్సీ నిర్వహకులు సిద్దిపేటలో పర్యటించి ముందుగా పట్టణంలోని నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా రూఫ్ టాప్‌లను నిర్వహకులు ఎంచుకున్నారు. సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం, కోమటిచెరువు వద్దనున్న ఓ భవనం, నెక్లెస్ రోడ్డు, అడ్వెంచర్ పార్కులోని భవనాలపై ఈ సోలార్ పాన్నెళ్ల ఏర్పాట్లు చేయనున్నారు. ఈ మేరకు పనులను ప్రారంభించింది.



సిద్దిపేట పట్టణంలోని నెక్లెస్ రోడ్డులో ఓ భవనంపై ఏర్పాటు చేస్తున్న సోలార్ సిస్టమ్

రూ. 79.20 లక్షలతో, 95 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగేలా

సోలార్ పవర్ ద్వారా 95 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగేందుకు రూ. 79.20 లక్షలతో సోలార్ వ్యవస్థను ఏర్పాటు

మిగతా 8వ పేజీలో..

ప్రాంతం	సోలార్ ఉత్పత్తి	అంచనా రూ.
మున్సిపల్ ఆఫీస్	29 కి.వా	24 లక్షలు
నెక్లెస్ రోడ్డు	24 కి.వా	20 లక్షలు
అడ్వెంచర్ పార్కు	13 కి.వా	11.20 లక్షలు
కొమటిచెరువు	29 కి.వా	24 లక్షలు

ప్రాంతం	మీటరు	బిల్లు రూ.ల్లో
కోమటిచెరువు	6168023	501.00
కోమటిచెరువు కట్ట	5050913	89,153.00
కోమటిచెరువు	284831	21,306.00
కోమటిచెరువు	2871704	768.00
నెక్లెస్ రోడ్డు	5034708	39,296.00
అడ్వెంచర్ పార్కు	5430375	3,128.00
మున్సిపల్ ఆఫీస్	000263612	41,571.00
ఎస్టీపీ నర్సాపూర్	2666	19,52,737.00
ఎస్టీపీ చింతల్ చెరువు	2568	5,53,903.00
కమ్మర్లపల్లి	ఎస్‌డీపీటి 1358	32,69,001.00
ఇల్లంతకుంట	కెఆర్ఎస్ 300	31,59,222.00
యశ్వాడా (5.20 ఎంఎల్‌డీ)	కెఆర్ఎస్ 276	25,51,202.00
వీధి దీపాలు	---	17,09,881.00
పవర్ బోర్లు	---	8,44,883.00
మొత్తం		1,40,40,829.00



చేనేతకు లినెన్ కళ

- పోటీ ప్రపంచంలో నిలబడేందుకు సరికొత్త పంథాలో చేనేత కార్మికులు
- లినెన్ ఇక్కత్ ఫ్యాబ్రిక్‌తో అధునాతన డిజైన్లలో చీరల తయారీ
- నెలకు రూ.25వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదన
- దుబ్బాక చేనేత సహకార సంఘం పరిస్థితి ఇందుకు భిన్నం
- తరాలుగా వస్తున్న గొల్లభామ చీర కనుమరుగు

7

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో
రాష్ట్రస్థాయి వర్క్‌షాప్

7

నర్సారెడ్డి దళిత పక్షపాతి

- కాంగ్రెస్ పార్టీ నాయకులు

7

కనుల పండువగా
స్వామివారి కల్యాణం

8



ర్యాలీ నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాల విద్యార్థులు

బ్రెస్ట్ ఫీడింగ్ బెస్ట్

సురభి నర్సింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం 'బ్రెస్ట్ ఫీడింగ్' కార్యక్రమాన్ని పురస్కరించుకుని సిద్దిపేట బీజేఆర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అప్పుడే పుట్టిన శిశువుకు తల్లిపాలు పట్టించడం వలన రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉం టారని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గా, సురభి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బులాయి సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

- సిద్దిపేట అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి)

జయశంకర్ సేవలు
మరువలేనివి

ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లాలో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు, నాయకులు అధికారులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. తెలంగాణకు కొత్తపల్లి జయశంకర్ దిక్సూచిగా ఉన్నారని, ఆయన తెలంగాణ సాధనలో ఎంతో శ్రమించారని గుర్తుచేసుకున్నారు.

- సిద్దిపేట క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి)



సిద్దిపేటలో జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీఎన్జీవో నాయకులు



రాఖీ బంధం ప్రత్యేకంగా..

- ఫొటో రాఖీల ట్రెండ్
- సిద్దిపేటలో మొదలైన రాఖీ సందడి

సిద్దిపేటలో రాఖీ పండుగ సందడి మొదలైంది. మహిళలు, పిల్లలు రాఖీలు కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. సాధారణంగా లభించే థ్రెడ్ రాఖీలు, డిజైన్ రాఖీలు, వెండి రాఖీలతో పాటు ఈసారి ప్రత్యేకంగా ఫొటో రాఖీలు అందుబాటులోకి వచ్చాయి. తమ అన్నదమ్ముల ఫొటోలు ఒక రోజు ముందుగా ఇస్తే, వాటితో రాఖీలు తయారు చేసి ఇస్తున్నారు. ఇది వినియోగదారులకు కొత్త అనుభూతిని ఇస్తోంది. అలాగే, పిల్లల కోసం ప్రత్యేకంగా డోరేమాన్ రాఖీలు కూడా లభిస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి రాఖీల ధరలు కాస్త ఎక్కువగా ఉన్నాయని వినియోగదారులు చెబుతున్నారు. రూ.10 నుంచి రూ.1500 వరకు రాఖీలు అందుబాటులో ఉన్నాయి.

- సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆగస్టు 6





జిల్లావ్యాప్తంగా వాహన తనిఖీలు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బుధవారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో 78 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలు, ట్రిపుల్ రైడింగ్, అధిక వేగంతో వాహనాలు నడిపే వారిపై, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిపై, సరైన ధ్రువపత్రాలు లేని వారిపై, నిబంధనలు పాటించని వారిపై ఎంవి యాక్ట్ ప్రకారం 437 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీపీ అనురాధ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలు అక్రమ రవాణా నివారించడానికి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు





డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన స్కూల్ బస్ డ్రైవర్

జగదేవ్‌పూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట బుధవారం డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఈ టెస్టుల్లో మండల కేంద్రంలోని మాస్టర్ మైండ్ పాఠశాల బస్సు నడుపుతున్న డ్రైవర్ పరశురాములుకు డ్రంక్ టెస్ట్ నిర్వహించగా 216 ఎంజీ వచ్చింది. బస్సులో సుమారు 40 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. పోలీసులు బస్సును సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై కృష్ణారెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఇతరుల ప్రాణాలకు ప్రమాదకరంగా వ్యవహరించే వారిపై చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామన్నారు. స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్‌లు అప్రమత్తంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడిపి విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని హెచ్చరించారు.





వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

జహీరాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలో గోవిందాపూర్ క్రిష్ణ(45) అనే వ్యక్తి జూన్14న అదృశ్యమయ్యాడు. ఎస్సై వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందాపూర్ క్రిష్ణకు తనభార్యతో మనస్పర్థలు రావడంతో మూడేళ్ళ క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తన అన్న గోవిందాపూర్ వెంకట్ వద్దనే ఉంటున్నాడు. జూన్ 14న పనికి వెళ్తానని చెప్పి వెళ్లిపోయాడు. ఇరుగు, పొరుగు వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అన్న వెంకట్ బుధవారం ఫిర్యాదుచేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అన్నారు. అలాగే అల్లీపూర్‌కు చెందిన షేక్‌మోహీజ్(29)ఈ నెల 5న ఇంటినుంచి బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయాడు. మూడు రోజులుగా ఇరుగుపొరుగు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించక పోవడంతో భార్య యాస్మీన్‌బేగం బుధవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఈ వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తే జహీరాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



గోవిందాపూర్ క్రిష(ఫైల్), షేక్‌మోహీజ్ (ఫైల్)

వంట గ్యాస్ లీక్.. ముగ్గురికి గాయాలు

ఝరాసంగం, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఏడాకులపల్లి గ్రామంలో బుధవారం ఉదయం ప్రమాదవశాత్తు ఇంట్లో వంట గ్యాస్ లీకేజీ కావడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలోని గొర్రెకంటి శంకరమ్మ ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. తల్లి కేకలు వేయడంతో అరుబయట ఉన్న ఇద్దరు కుమారులు ఇంట్లోకి రావడంతో వారికి కూడా గ్యాస్ తగిలి చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి.

అన్న ఇంట్లో తమ్ముడు చోరీ

దుబ్బాక, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపల్ మల్లాయపల్లి వార్డులో అన్న ఇంట్లో దొంగతనం చేశాడు ఓ తమ్ముడు. అయితే ఎనిమిదినెలల తర్వాత బుధవారం సోదరుడిని పోలీసులు పట్టుకున్నారు. దుబ్బాక ఎస్సై కీర్తిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాయపల్లి గ్రామానికి చెందిన కీసరి రమేష్ ఇంట్లో గత జనవరి 15న దొంగతనం జరిగి, పావుతులం బంగారం, నాలుగు తులాల వెండి, 15వేల నగదు దొంగలించారు. రమేష్ ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ జరిపిన పోలీసులు ఎనిమిది నెలలకు తమ్ముడు కీసరి రాజును పట్టుకున్నారు. అతడిని విచారించగా, తాను వ్యసనాలకు బానిసై, తాగడానికి తాను దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. పోలీసులు అరెస్టుచేసి, నిందితుడిని రిమాండ్‌కు పంపించారు.









1.45 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత

మునిపల్లి, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా సరఫరా చేస్తున్న ఎండు గంజాయిని కంకోల్ టోల్ ప్లాజా వద్ద ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. ప్రొహిబీషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి నవీన్ చంద్ర ఆదేశాల మేరకు బుధవారం మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద ఎక్సైజ్ శాఖ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ కారుపై అనుమానం రావడంతో ఆపి తనిఖీ చేయగా అందులో 1.45గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇస్నాపూర్‌కు చెందిన వీరేష్, సాయికిరణ్ రెడ్డి, రాహుల్ అనే ముగ్గురు ఎండు గంజాయిని బీదర్‌లో తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు వారు ఒప్పుకున్నారని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. 1.45గ్రాముల ఎండు గంజాయితోపాటు స్విఫ్ట్ కారు, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు డీటీఎఫ్ ఎస్సై హనుమంత్ తెలిపారు. ఈదాడుల్లో ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అంజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

పాముకాటుతో రెండేళ్ల చిన్నారి మృతి



రోహిత్(ఫైల్)

నాగల్‌గిద్ద, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో బాలుడు మృతి చెందిన సంఘటన బుధవారం మండల పరిధిలోని మెదక్ జిల్లా నాగిల్‌గిద్ద రేఖతండాలో జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన వెంకట్, లక్ష్మిబాయిల కుమారుడు రోహిత్(2) ఇంటి ఎదుట ఆడుకుంటున్నాడు. తండ్రి వ్యవసాయ పనులకు వెళ్లగా, తల్లి ఇంట్లో పనులు చేసుకుంటోంది. ఈ సమయంలో చిన్నారిని పాము కాటు వేసింది. బాబు ఏడుస్తుండటంతో తల్లి బయటకు వచ్చి చూడగా పాము కాటు వేసినట్లు తెలిసింది. వెంటనే కుటుంబీకులు, నారాయణఖేడ్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

భవనంపై నుంచి పడి వ్యక్తి..

● మరొకరికి తీవ్రగాయాలు

పెద్దశంకరంపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం పెద్దశంకరంపేటలో జరిగింది. పెద్దశంకరంపేటకు చెందిన ఎండీ జావిద్(40) తిరుమలాపూర్‌లో తన ఇంటి నిర్మాణ పనులు చేయిస్తున్నాడు. భవనంపై ఉన్న సామగ్రిని చేరవేసే క్రేన్‌ను జావిద్, అతడితో పాటు భవన నిర్మాణ కార్మికుడు పాపన్నపేట మండలం చీకోడ్ గ్రామానికి చెందిన శంకర్‌తో కలిసి సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు భవనంపై నుంచి ఇద్దరు కింద పడి పోయారు. ఈ క్రమంలో జావిద్‌కు తీవ్ర గాయాలయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. శంకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. అల్లాదుర్గం ఎస్సై శంకర్ పేట ఏఎస్సై సంగమేశ్వర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



చాపల మహేష్ (ఫైల్)

హవేళిఘణపూర్, ఆగస్టు 6;(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనాల ప్రకారం.. జక్కన్నపేట గ్రామానికి చెందిన చాపల మహేష్(26) వ్యవసాయంతో పాటు కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. కుటుంబపోషణ, వ్యవసాయ పెట్టుబడులకు అప్పులు చేసాడు. ఈ అప్పులు ఎలా తీర్చాలోనని కుటుంబీకులకు చెప్పుకుంటూ బాధపడుతుండేవాడు. ఆదివారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరిలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ హస్పటల్‌కు తరిలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సంతోషి, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుడి తండ్రి శంకరయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎసై రాజు తెలిపారు. కాగా పెద్ద కూతురికి కళ్లు కనబడవు, చిన్న కుమార్తెకు ఎడమ చేయి మణికట్టు వరకు లేదు. ఈ దివ్యాంగులైన వారిని సాకేవారు ఎవరని కుటుంబీకుల రోదనలు మిన్నంటినాయి.

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం.. ఎద్దు మృతి



విద్యుత్ షాక్‌తో సజీవ దహనమౌతున్న ఎద్దు

మనూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎద్దు షార్ట్ సర్క్యూట్‌తో సజీవ దహనమైంది. ఈ సంఘటన బుధవారం మనూరు మండలం రాయిపల్లిలో జరిగింది. ఇందుకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గ్రామంలోని హుస్సేన్‌కు చెందిన ఎద్దు మేత మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి వెళ్లింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి ఎద్దు అక్కడికక్కడే సజీవ దహనమై మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచ ఏర్పాటు చేయక పోవడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.80 వేలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి మండలంలోని ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచ ఏర్పాటు చేసి నష్టపోయిన రైతును ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రంగనాయక సాగర్‌లో మహిళ శవం లభ్యం

సిద్దిపేట క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రంగనాయక సాగర్ కాలువలో ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన సిద్దిపేట బుధవారం పట్టణ శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట పట్టణ శివారు రంగనాయక సాగర్ కాలువలో మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సిద్దిపేట వన్ టౌన్ పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి సిద్దిపేట ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతిచెందిన మహిళ ఇమాంబాద్‌కు చెందిన రాణి (37)గా గుర్తించారు. మృతురాలు వ్యవసాయ పనులు చేసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. మహిళ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఘన నివాళి



ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకుడు నీలం మధు ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే గద్దర్ రెండవ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

- పటాన్ చెరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి)



మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జయశంకర్ జయంతి కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

- మెదక్ అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి)



సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయశంకర్ జయంతి కార్యక్రమంలో కలెక్టర్ కె. హైమావతి ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళులర్పించారు.

- సిద్దిపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి)



ఎంఎన్ఆర్ యూనివర్సిటీని సందర్శించిన బ్రిటీష్ డిప్యూటి హై కమిషనర్

భారత, బ్రిటన్ విశ్వవిద్యాలయాల మధ్య సహకారం విస్తరించాలి

● **బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ విన్ ఓవెన్ పిలుపు**

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భారత, బ్రిటన్ విశ్వవిద్యాలయాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించాలని బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ విన్ ఓవెన్ అన్నారు. బుధవారం ఆయన సంగారెడ్డి మండలం, ఫసల్వాది గ్రామ పరిధిలోని ఎంఎన్ఆర్ యూనివర్సిటీని సందర్శించారు. విద్యారంగంలో అంతర్జాతీయ భాగస్వామ్యాల ప్రాముఖ్యత పెరుగుతోందని, రెండు దేశాల విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడం చాలా కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొ. కృష్ణచలం, రిజిస్ట్రార్ ప్రొ. సత్యనారాయణ, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డీన్ డా. కిరణ్, మెడికల్ అండ్ అలైడ్ హెల్త్ సైన్సెస్ డీన్ డా. వెంకటరమణ, అకడమిక్స్ డీన్ డా. రవి, సీనియర్ సైంటిస్ట్ డా. షహీలా పర్వీన్, హాస్పిటల్ సీఈవో సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం బీజేపీ ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్

మద్దూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలంలోని లద్నూరు రిజర్వాయర్‌ను నింపి, చెరువులు, కుంటల్లోకి నీళ్లు మళ్లించి రైతులకు సాగునీరు అందించాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంగోని సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో మద్దూరులో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేశ్‌గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా నియోజకవర్గ రైతులకు సాగునీరు విడుదల చేయించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ధర్నా జరుగుతున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ స్థానిక తహసీల్దార్ రహీంకు సమాచారం ఇవ్వగా, ఆయన అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై లిఖితపూర్వకంగా వినతి పత్రాన్ని అందించాలని సూచించారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తానని చెప్పడంతో కార్యకర్తలు వినతిపత్రాన్ని అందించి ధర్నా విరమించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేక సుదర్శన్, బాలకృష్ణ, బొల్లు రాజు, సందీప్, సాయి, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వివాహితది హత్యంటూ ఆందోళన

● **తూప్రాన్ సర్కిల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత**



తూప్రాన్ సర్కిల్ కార్యాలయం వద్ద గుమిగూడిన జనం

తూప్రాన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వివాహితను అత్తింటివార హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు బుధవారం ఆందోళనకు దిగారు. దీంతో తూప్రాన్ సర్కిల్ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దౌల్తాబాద్ మండలం, ఎల్కంటి గ్రామానికి చెందిన నాగరాణి, శివ్వంపేట మండలం, చండి గ్రామానికి చెందిన సత్యనారాయణతో వివాహం జరిగింది. మంగళవారం కుటుంబ కలహాల కారణంగా నాగరాణి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే, నాగరాణిని హత్య చేశారని ఆరోపిస్తూ ఆమె పుట్టింటి బంధువులు మంగళవారం చండి గ్రామంలో సత్యనారాయణ ఇంటిపై దాడి చేశారు. బుధవారం ఎల్కంటి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, పురుషులు తూప్రాన్ సర్కిల్ కార్యాలయానికి వచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. పోలీసులు, సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ శివానందం వారిని సముదాయించారు. ఇరు కుటుంబాలకు చెందిన పెద్ద మనుషుల మధ్య చర్చలు జరిపేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. దీంతో ఆందోళనకారులు శాంతించి పోలీసు స్టేషన్ ఆవరణలో కూర్చున్నారు. రాజీ కోసం ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగాయి.

మహాధర్నాను విజయవంతం చేయాలి



కలెక్టరేట్ వద్ద మహాధర్నా ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరసిస్తూ నిర్వహించే రైతు మహాధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఇఫ్కో మాజీ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ నాయకులతో కలిసి ధర్నా చౌక్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సన్న వడ్లకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, రుణమాఫీ, ఇతర హామీలను విస్మరించిందని విమర్శించారు. రైతు ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం సాగిస్తుందని ఆయన చెప్పారు. ఈ మహాధర్నాకు మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, నిరంజనరెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు. ధర్నా చౌక్‌ను పరిశీలించిన వారిలో మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున గౌడ్, నాయకులు భీమరి కిశోర్, గంగా నరేందర్, లింగారెడ్డి, ప్రభురెడ్డి, సోములు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

చేనేతకు లినెన్ కళ

పోటీ ప్రపంచంలో నిలబడేందుకు సరికొత్త పంథాలో చేనేత కార్మికులు

- ● లినెన్ ఇక్కత్ ఫ్యాబ్రిక్‌తో అధునాతన డిజైన్లలో చీరల తయారీ
- ● నెలకు రూ.25వేల నుంచి 30 వేల వరకు సంపాదన
- ● దుబ్బాక చేనేత సహకార సంఘం పరిస్థితి ఇందుకు భిన్నం
- ● తరాలుగా వస్తున్న గొల్లభామ చీర కనుమరుగు



దుబ్బాకలో చేనేత లినిన్ వస్త్రాల తయారీ

నేడు జాతీయ చేనేత దినోత్సవం

దుబ్బాక, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు రంగుల ప్రపంచానికి పేరుగాంచిన దుబ్బాక చేనేత పరిశ్రమ, నేడు కన్నీటి గాథలకు నిలయంగా మారింది. దశాబ్దం క్రితం చేనేత కార్మికుల ఆత్మహత్యలకు దుబ్బాక ఒక ఉదాహరణగా నిలిచింది. సుమారు 112 చేనేత కుటుంబాలు ఆకలిచావులు, ఆత్మహత్యలకు బలైపోయాయి. వేలాది మంది కార్మికులు వృత్తిని వదిలి, సోలాపూర్, భీమండి, నాందేడ్ వంటి ప్రాంతాలకు వలస వెళ్లారు. మిగిలిన కొందరు చేనేత సహకార సంఘంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే, సంఘం కూడా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడంతో వారికి సరైన ఉపాధి దొరకడం లేదు. దీంతో దుబ్బాక చేనేత కార్మికులు మూడు భిన్నమైన పరిస్థితుల్లో తమ జీవితాలను వెళ్లదీస్తున్నారు. నేడు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా దుబ్బాక చేనేత కార్మికుల స్థితిగతులపై ప్రత్యేక కథనం.

కొత్త పంథాలో చేనేత కళాకారులు

సంక్షోభం నుంచి బయటపడాలని నిర్ణయించుకున్న కొంతమంది చేనేత కార్మికులు తమ వృత్తిని కాపాడుకునేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. వీరంతా కలిసి దుబ్బాక హ్యాండ్లూమ్ ప్రొడ్యూసర్ కంపెనీని స్థాపించారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో శిక్షణ పొందిన ఈ కార్మికులు, మార్కెట్ డిమాండ్‌ను బట్టి లినెన్ వస్త్రాల తయారీని ఎంచుకున్నారు. మొదట్లో తువ్వాళ్లు, రుమాళ్లు తయారు చేసిన వీరు, క్రమంగా లినెన్ ఇక్కత్ ఫ్యాబ్రిక్ (100 శాతం లినెన్) చీరలను తయారు చేయడం ప్రారంభించారు. డిజైనర్ల సహాయంతో కలకత్తా బ్లాక్ ప్రింట్, జైపూర్ బ్లాక్ ప్రింట్ బగ్రులను తయారు చేస్తున్నారు. హన్మకొండ, బెంగళూరు, ధార్వాడ్ వంటి ప్రాంతాల నుంచి కసూతి హ్యాండ్ ఎంబ్రాయిడరీ, లక్నో నుంచి చికెన్‌కరీ ఎంబ్రాయిడరీ చేయించి మరింత ఆకర్షణను జోడిస్తున్నారు.

నెలకు రూ.30 వేలు..

గతంలో రోజుకు కేవలం రూ. 50 కూలి కూడా దొరకని పరిస్థితి నుంచి, ఇప్పుడు లినెన్ ఇక్కత్ చీరల తయారీ ద్వారా ఒక్కో కార్మికుడు నెలకు రూ. 25వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదిస్తున్నారు. ఈ కళాకారుల కృషికి గుర్తింపుగా, అయోధ్య రామాలయ ట్రస్ట్ బాలరాముడి అలంకరణ కోసం వీరు నేసిన లేత గులాబీ రంగు వస్త్రాలను ఆమోదించింది. మార్కెటింగ్‌కు సోషల్ మీడియాను, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లను వేదికగా చేసుకుంటున్నారు.

కనుమరుగవుతున్న గొల్లభామ చీర

చేనేత వృత్తిలో దుబ్బాకకు ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చిన అరుదైన కళ 'గొల్లభామ చీర' నేడు కనుమరుగు అంచున ఉంది. 70 ఏళ్ల క్రితం కలకత్తా నుంచి నేర్చుకున్న వారు ఈ చీరను నేసేవారు. ప్రస్తుతం ఒకరిద్దరు మాత్రమే మిగిలారు. దుబ్బాకకు చెందిన 71 ఏళ్ల లొంక బాలయ్య తన తండ్రి నుంచి నేర్చుకున్న ఈ కళను ఇంకా కొనసాగిస్తున్నారు. 15 నుంచి 20 రోజులు కష్టపడి ఒక చీరను నేయాల్సి ఉండటం, తగిన ప్రోత్సాహం లేకపోవడంతో ఈ కళపై కొత్త తరం ఆసక్తి చూపడం లేదు. తన తండ్రి వారసత్వాన్ని వదలలేనని చెప్పే బాలయ్య కృషిని ప్రభుత్వం ఇప్పటివరకు గుర్తించలేదు. తన తర్వాత ఈ కళను కొనసాగించేవారు లేకపోవడంతో, ఈ అద్భుతమైన కళ చరిత్రలో కలిసిపోయే ప్రమాదం ఏర్పడింది.





దుబ్బాక చేనేత సహకార సంఘంలో పని చేస్తున్న కార్మికులు

అప్పుల ఊబిలో చేనేత సహకార సంఘం

ఒకప్పుడు 6 వేల మందికి ఉపాధి కల్పించిన దుబ్బాక చేనేత సహకార సంఘం నేడు అప్పుల ఊబిలో కూరుకుపోయింది. 2018లో నాటి మంత్రి కేటీఆర్ సంఘాన్ని సందర్శించి, ప్రభుత్వం తరఫున రుణం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. 2019లో రూ. 52 లక్షల రుణం లభించినప్పటికీ, ఇది పాత అప్పులు తీర్చడానికే సరిపోయింది. ప్రభుత్వం నుంచి మరింత సాయం అందకపోవడంతో, అప్పులు పెరుగుతూ పోయాయి. ప్రస్తుతం సంఘం అప్పు రూ.1.10 కోట్లకు చేరింది. దీంతో కార్మికులకు తగినంత పని కల్పించలేక, వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయి.

నర్సారెడ్డి దళిత పక్షపాతి

● **కాంగ్రెస్ పార్టీ నాయకులు**



గజ్వేల్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గజ్వేల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి దళిత పక్షపాతి అని వర్గల్ మాజీ ఎంపీపీ భాగనేళ్ల మోహన్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని నర్సారెడ్డి ఇంటి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేసీఆర్, హరీశ్‌రావులతో పోరాడిన నర్సారెడ్డి తమ ఆధిపత్యానికి అడ్డు వస్తున్నాడన్న కారణంతో మైనంపల్లి హనుమంతరావు కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే అయిన నర్సారెడ్డి రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో స్టేజీ ఎక్కలేదని, కానీ ప్రోటోకాల్ లేని విజయ్ స్టేజీ ఎక్కి హంగామా సృష్టించారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు కొడకండ్ల నర్సింహులు, తూప్రాన్ అనిల్, లకుడారం అండాలమ్మ, కొత్తూరు వీరేశం, తూప్రాన్ వెంకటస్వామి, ప్రజ్ఞాపూర్ శివులు, యాదగిరి, మహేందర్, శ్రీనివాస్, వెంకటేష్, మల్లికార్జున, రత్నాకర్, బాబు, గణేశ్, సురేశ్, బాలు, దయ్యాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరువు తీస్తున్న బీఆర్ఎస్ కోవర్టులు

కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు హరీశ్‌రావుతో కుమ్మక్కై పార్టీ పరువు తీస్తున్నారని టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి ఆరోపించారు. గజ్వేల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, స్వప్రయోజనాల కోసం మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మైనంపల్లి హనుమంతరావును విమర్శించే స్థాయి గజ్వేల్ నాయకులకు లేదని, గతంలో నియోజకవర్గంలో పార్టీ కార్యకర్త చనిపోతే పరామర్శించని వ్యక్తులు కూడా ఇప్పుడు తామే నాయకులమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. దళితుడిపై దాడి జరిగితే సంఘటితం కావాల్సిన వారే ఇలా ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడడం సిగ్గుచేటన్నారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని..

● యువకుడి ఆత్మహత్యాయత్నం



జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న శ్రీకాంత్ యాదవ్

నంగునూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అన్ని అర్హతలు ఉన్నా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాకపోవడంతో సిద్దిపేట జిల్లా, నంగునూరు మండలం, పాలమాకుల గ్రామానికి చెందిన వరదోలు శ్రీకాంత్ యాదవ్ అనే వ్యక్తి బుధవారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామంలో తన ఇల్లు శిథిలావస్థకు చేరడంతో అద్దె ఇంట్లో ఉంటున్న శ్రీకాంత్, ఇందిరమ్మ ఇల్లు కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాడు. అధికారులు విచారణ చేపట్టి అర్హుల జాబితాలో అతని పేరు చేర్చారు. మొదటి విడతలో అతని పేరు రాలేదు. దీంతో కలత చెందిన శ్రీకాంత్ హనుమకొండ-సిద్దిపేట జాతీయ రహదారిపై పాలమాకుల బస్ స్టాప్ వద్ద బైఠాయించి, పెట్రోల్ తాగుతూ కొంత ఒంటిపై పోసుకొని నిప్పంటించుకునే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సరిత గ్రామానికి చేరుకొని బాధితుడితో మాట్లాడి వివరాలు సేకరించారు. పోలీసులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై మండల ప్రత్యేక అధికారి, డీపీవో దేవకిదేవిని వివరణ కోరగా, శ్రీకాంత్ పేరు మీద ప్రజాపాలనలో ఎలాంటి దరఖాస్తు లేదని, అతని తల్లి బుచ్చవ్వ దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రెండో విడతలో బుచ్చవ్వకు ఇల్లు ఇచ్చే విషయం పరిశీలనలో ఉందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదని, అర్హులైన వారందరికీ విడతలవారీగా మంజూరు చేస్తామన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్



ప్రదర్శనను తిలకిస్తున్న వక్తలు, ముఖ్య అతిథులు



మొక్కలకు క్యూఆర్ కోడ్

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఎక్స్‌ప్లోరింగ్ ది బొటానికల్ వరల్డ్, ఏ హ్యాండ్స్ ఆన్ అడ్వెంచర్' పేరుతో రాష్ట్రస్థాయి కార్యశాల నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యశాలలో భాగంగా బుధవారం జరిగిన సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. సునీత అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా హాజరైన ఎన్ఆర్ఎస్సీ శాస్త్రవేత్త డా. సుధాకర్ రెడ్డి మొక్కల పరిణామం, భవిష్యత్తు గురించి, వాటిని గుర్తించడానికి ఉపయోగించే సాంకేతిక పరికరాలైన జీపీఎస్, జీఐఎస్ గురించి వివరించారు. అనంతరం, రిటైర్డ్ ఎమినెంట్ ప్రొఫెసర్ వాత్సవాయ ఎస్ రాజు మొక్కల వర్గీకరణపై, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. ఇ. నరసింహమూర్తి జీవ వైవిధ్యం, సంరక్షణ పద్ధతుల గురించి వివరించారు. కళాశాలలోని మొక్కలకు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి, సీవోఈ డా. గోపాల సుదర్శనం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ మధుసూదన్, కార్యశాల కన్వీనర్ డా. రాణి కొమ్మిడి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. శైలజ, కోకన్వీనర్‌లు డా. మీరాజ్ ఫాతిమా, స్రవంతి, మోతుకు శ్రీనివాస్, దువ్వల శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గుబ్బా కోల్డ్‌స్టోరేజ్‌లో భారీ అగ్నిప్రమాదం

గుమ్మడిదల ఆగస్టు,6 (ఆంధ్రజ్యోతి); గుమ్మడిదల పీఎస్ పరిధిలోని అన్నారం పరిధిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. అన్నారం నుంచి జిన్నారం వెళ్లే ప్రధాన రహదారి పక్కనే గల గుబ్బా కోల్డ్ స్టోరేజ్‌లో రాత్రి 9 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మంటల సెగ సమీపంలోని అన్నారం, జంగపేట గ్రామాలకు తాకడంతో ప్రజలు ఒక్కసారిగా బయటకు వచ్చి భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికుల నుంచి విషయం తెలుసుకున్న గుమ్మడిదల పోలీసులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో జీడిమెట్ల, నర్సాపూర్, పటాన్‌చెరు, గడ్డపోతారం ప్రాంతాల నుంచి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. ఈ అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కానీ భారీగా ఆస్తినష్టం జరిగింది. ఈ ప్రమాదంపై స్థానికులు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేశారు. స్టోరేజీ యాజమాన్యం ఇన్సూరెన్స్ కోసం కావాలనే స్టోరేజీని తగలబెట్టిందని ఆరోపించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉన్నది.



ఎగిసి పడుతున్న మంటలు


సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపన్యాస పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం


హుస్నాబాద్‌లో అంబేద్కర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ లింగమూర్తి, తదితరులు


మర్కుక్: అంగడికిష్టాపూర్ పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, సిబ్బంది


దుబ్బాకలో ఆచార్యజయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

తెలంగాణకు దిక్సూచి జయశంకర్

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతిని సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయా మండలాల్లోని ప్రధాన కూడళ్లు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచినవారికి బహుమతులను అంద జేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై నిరంతరం తెలంగాణ సమాజంలో చైతన్యం కల్పిస్తూ దిక్సూచిగా వ్యవహరించారన్నారు. ఆయన అంకితభావం, భావజాలం ఎంతోమందికి ఆదర్శమైందన్నారు. ఇలాంటి మహనీయుల చరిత్ర విద్యార్థులకు మార్గదర్శకమని కొనియాడారు.


ములుగు: హార్టికల్చర్ యూనివర్సిటీలో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 25మందికి జరిమానా

గజ్వేల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఐటీ వల ట్రాఫిక్ సీఐ మురళి ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 25 మంది వాహనదారులు పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ఎదుట హాజరుపరచగా, విచారణ అనంతరం నిందితులకు రూ.41వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

మద్యం తాగి వాహనం నడపొద్దు: ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేట క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపరాదని ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ సూచించారు. సిద్దిపేట పట్టణంలో, వివిధ మండలాలకు చెందిన వ్యక్తులు వివిధ ప్రాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 35 మందికి సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ సెంటర్‌లో ఏసీపీ కౌన్సెలింగ్ నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజంటే షన్ ద్వారా ఓవర్ స్పీడ్, డ్రంకెన్ డ్రైవ్ తదితర ప్రమాదాల గురించి ఆడియో వీడియో ద్వారా అవగాహన కల్పించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


ఇర్కోడ్ మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

సిద్దిపేట రూరల్/రాయపోల్/బెజ్జంకి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట రూరల్ ఎస్ఐ రాజేష్ విద్యార్థులకు సూచించారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్‌లకు బానిస కావద్దని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ పరమేశ్వర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు. రాయపోల్ మండలం రామారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిళల రక్షణకు చట్టాలపై ఎస్ఐ మానస అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజగోపాల్‌రెడ్డి, గజ్వేల్ షీటీమ్ బృందం తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం ఎస్ఐ సౌజన్య సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు.

సిద్దిపేట ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

● వైద్యుల నిర్లక్ష్యమేనంటూ కుటుంబ సభ్యుల ఆందోళన

సిద్దిపేట క్రైం/సిద్దిపేట అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యం తోనే చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తూ సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాల మండలం నాగపురి గ్రామానికి చెందిన మల్లారెడ్డి మురళి (37) తీవ్రంగా జ్వరం రావడంతో మంగళవారం ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. డ్యూటీ డాక్టర్ మురళికి రక్త పరీక్షలు నిర్వహించి, ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్నాయని రక్తం ఎక్కించాలని కుటుంబ సభ్యులకు చెప్పారు. ఆస్పత్రిలో అడ్మిట్ అయిన మురళి చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. అయితే వైద్యుల నిర్లక్ష్యం వల్లే మురళి మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు న్యాయం చేయాలని ఆస్పత్రి ముందు బైఠాయించారు. వన్ టౌన్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులు బంధువులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. కాగా సదరు ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స కోసం చేరిన వ్యక్తి మంగళవారం రాత్రి క్షేమంగానే ఉన్నట్లు చెప్పిన వైద్యులు అర్ధరాత్రి రెండు గంటలకు మరణించాడని చెప్పడం తీవ్ర అనుమానాలు కలుగుతున్నాయని సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి చింత భూమేశ్వర్ ఆరోపించారు. జిల్లా కలెక్టర్ విచారణ జరిపి సదరు హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జాబ్ కార్డులు ఉన్నవారికి పని కల్పించాలి

జగదేవ్‌పూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్నవారికి వంద రోజుల పని దినాలు కల్పించాలని, జాబ్ కార్డు లేని వారికి ఇతరుల పేర్లపై ఉన్న జాబ్ కార్డులపై పని దినాలు కల్పించినట్లయితే సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తప్పవని అడిషనల్ పీడీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు 2024-25వ సంవత్సరంలో జరిగిన పనులపై 16 విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో భాగంగా 29 గ్రామపంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులపై డీఆర్పీలు విచారణ చేపట్టి ఆయా పనుల్లో అవకతవకలను గ్రామ సభలో వివరించారు. అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి డబ్బు రికవరీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సర్కారు బడుల్లో ఉచితంగా సైకిళ్ల పంపిణీ


శనిగరం ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు పంపిణీ చేసిన సైకిళ్లు

కోహెడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శనిగరం, తంగళ్లపల్లి, వరికోలు, రామచంద్రాపూర్, వింజపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బీజేపీ నాయకులు బుధవారం సైకిళ్లు పంపిణీ చేశారు. మోదీ కానుకగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కరీంనగర్ పార్లమెంటు పరిధిలో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందజేస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా సికింద్రాబాద్ బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ తడిసిన రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఖమ్మం వెంకటేశం, బీజేపీ మండల అధ్యక్షుడు జాలిగం రమేష్ చేతుల మీద విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు దాసా శేఖర్, బొమ్మదవేని రాజు,మోడీ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములు అన్యాక్రాంతం చేస్తే సహించం

సిద్దిపేట క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట మోహిన్ పుర వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన 5 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలని వెంకటేశ్వర స్వామి ఆలయ ఆస్తుల పరిరక్షణ సమితి నాయకులు ఉడుత మల్లేశం, శేఖర్ కోరారు. బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గతంలో 5 ఎకరాల ఆలయ పేరిట ఉండేది, ఇప్పుడు కొందరు 4 ఎకరాల భూమిని తమ పేర్ల మీదకి మార్చుకొని అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆలయ నిర్మాణం నుంచి ఉన్నటువంటి ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తి ధర్మకర్తగా ఎలా వ్యవహరిస్తారని వారు ప్రశ్నించారు.ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి ఆలయ ధర్మకర్తను కొత్తవారిని నియమించాలని కోరారు. సమావేశంలో వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆస్తుల పరిరక్షణ సమితి నాయకులు ఉన్నారు.

గద్దర్ అడుగుజాడల్లో నడుద్దాం


సిద్దిపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు

సిద్దిపేట అర్బన్/కొమురవెల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గద్దర్ అన్న ఆశయాలకు అనుగుణంగా ఆయన అడుగుజాడల్లో నడుద్దామని ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్ పోచబోయిన శ్రీహరి యాదవ్, వైస్ చైర్మన్ ఆస లక్ష్మణ్ పేర్కొన్నారు. గద్దర్ రెండో వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పొన్నాల వై జంక్షన్ వద్ద విగ్రహ నిర్మాణ స్థలాన్ని ప్రతిపాదిస్తూ గద్దర్ ఫ్లెక్సీకి నివాళులర్పించారు. అనంతరం గద్దర్ ఆటపాటలతో స్థానిక కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, వైస్ చైర్మన్ కనకరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లి మండలంలోని ఐనపూర్ గ్రామంలో గద్దర్ వర్ధంతిని సాంస్కృతిక సారథి కవి గాయకుడు పిస్సాంటి రత్నం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

న్యూస్ బాక్స్

గురుకులాల్లో అధ్యాపక పోస్టుల భర్తీకి 11న ఇంటర్వ్యూలు

చేర్యాల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని పలు గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినట్లు జిల్లా గురుకులాల సమన్వయ అధికారి పోలోజు నరసింహాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఈనెల 11న చేర్యాల గురుకుల కళాశాలలో ఇంటర్వ్యూ, డెమో తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జగదేవ్‌పూర్ బాలికల కళాశాల, కొండపాక కళాశాలలో పీజీటీ ఇంగ్లీష్-1, హుస్నాబాద్ బాలుర కళాశాలలో హిస్టరీ-1, గజ్వేల్ బాలికల కళాశాలలో జేఎల్ బాటనీ-1, ఇంగ్లీష్-1, పీజీటీ ఇంగ్లీష్-1 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ బాలుర కళాశాలను సందర్శించిన డీఐఈవో

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను బుధవారం డీఐఈవో కె రవీందర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, అడ్మిషన్లు పెంపొందించడంపై అధ్యాపకులకు పలు సూచనలు చేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మర్కుక్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్ని రోజులుగా మర్కుక్, చేబర్తి గ్రామాల్లో తీవ్ర జ్వరంతో బాధపడుతున్న కుటుంబాలను సందర్శించి సాధారణ జ్వరాలుగా గుర్తించామని మర్కుక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు.

వైద్యంపై ప్రభుత్వానికి సోయిలేదు

దుబ్బాక, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు సిద్దిపేట జిల్లాలోని వైద్యం గురించి సమీక్ష జరపలేదని, ప్రజావైద్యం గురించి ఈ ప్రభుత్వానికి సోయిలేదని ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం దుబ్బాకలోని ఏరియా ఆసుపత్రిలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కాగా దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి వర్ధంతి సందర్భంగా దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. చిట్టాపూర్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి, రామలింగారెడ్డి సతీమణి సుజాత, కుమారుడు సతీష్‌రెడ్డిలతో కలిసి నివాళులర్పించారు.

రైతాంగాన్ని ఆదుకోవడంలో విఫలం

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రైతాంగాన్ని ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అన్నారు. బుధవారం సిద్దిపేటలోతెలంగాణ రైతు సంఘం ఆఫీస్ బేరర్స్ సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. రైతులకు యూరియా కొరతను నివారించి సన్నధాన్యానికి బోనస్ ఇప్పించాలని కోరారు.

పాఠశాలకు విరాళం

మద్దూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నిజాంనగరం నాటి మద్దూరు పాఠశాల అభివృద్ధికి 1984-85 బ్యాచ్ ఎస్సెస్సీ పూర్వ విద్యార్థులు రూ.25వేల విరాళాన్ని అందించారు.

గౌరవెల్లిని ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పాలి


హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధికార ప్రతినిధి సుద్దాల చంద్రయ్య, మల్లికార్జున్‌రెడ్డి

హుస్నాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టు పనులను ఎప్పుడు పూర్తిచేస్తారో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, ఐయిలేని మల్లికార్జున్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. బుధవారం వారు హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హుస్నాబాద్‌లో సాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ గౌరవెల్లి ప్రాజెక్టు కోసం అనేక నిధులు తీసుకువచ్చారని, కాని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 20 నెలలు దాటుతున్నా తట్టెడు మట్టి తీయలేదని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలి

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయదుంధుభి మోగించాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన భీమదేవరపల్లి మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎప్పుడు స్థానిక ఎన్నికలు వచ్చినా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

నంగునూరు,ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తుందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, సహకార సంఘం చైర్మన్ కోల రమేష్ గౌడ్ విమర్శించారు. బుధవారం నంగునూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పాదయాత్రల పేరుతో కాంగ్రెస్ నేతలు కొత్త నాటకం ఆడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు రాష్ట్రంలో పాదయాత్ర చేస్తూ ఢిల్లీలో ధర్నాలకు పూనుకోవడం సిగ్గుచేటైన విషయం అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వేణు, ఉల్లి మల్లయ్య, శ్రీకాంత్ యాదవ్, తప్పెట పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేస్తే జరిమానా

సిద్దిపేట ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో అధికారులతో కలిసి సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నాసర్ పురలో ఉన్నటువంటి శానిటరీ నిర్వహణను పరిశీలించారు. ఎర్ర చెరువు కట్ట వద్ద చెత్త ఎవరు వేస్తున్నారో సీసీ కెమెరా ద్వారా గుర్తించి జరిమానా విధించాలని ఆదేశించారు. బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు.

జిల్లాలో ముమ్మరంగా తల్లిపాల వారోత్సవాలు

సిద్దిపేట రూరల్/మద్దూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నారాయణరావుపేట, మద్దూరు, బెజ్జంకి తదితర మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలను నిర్వహించారు. నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో శారద వారికి తల్లిపాల ప్రాముఖ్యతను గురించి వివరించారు. ముర్రుపాలతో పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలియజేశారు. మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు రెండు సంవత్సరాల తర్వాత తల్లిపాలు ఇస్తూ బాలమృతం పెట్టాలని సూచించారు. అనంతరం అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బెజ్జంకి మండలంలోని కల్లెపల్లి గ్రామంలో బాలింతలు, గర్భిణులకు తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్న ప్రాసన చేయించారు.

యూరియాను బ్లాక్ మార్కెట్ చేస్తే చర్యలు

● జిల్లా వ్యవసాయాధికారి స్వరూప రాణి

సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల నిమిత్తం మాత్రమే యూరియాను వాడుకోవాలని, ఎవరైనా బ్లాక్ మార్కెటింగ్ గాని, పరిశ్రమల అవసరాలకు వాడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి హెచ్చరించారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండలం, నారాయణరావుపేట, చిన్నకోడూరు మండలాల్లో కోళ్ల ఫారాల్, పరిశ్రమల్లో, రైస్ మిల్లుల్లో వ్యవసాయ, రెవెన్యూ పోలీసు శాఖల సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయంత్, మండల వ్యవసాయ అధికారులు నరేష్, పరుశురాం రెడ్డి, ఏఈవోలు,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్రాలగొంది వాసికి డాక్టరేట్

సిద్దిపేట రూరల్,ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది వాసి బామండ్ల రాజుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. నిరుపేద కుటుంబంలో పుట్టిన రాజు ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన పీజీ తెలుగు ఎంట్రెన్స్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంక్ సాధించారు. పీజీ తెలుగు పూర్తయ్యేలోపు యూజీసీ నిర్వహించిన నెట్ పరీక్షలో ఆల్ ఇండియా టాప్ టెన్ లో జేఆర్ఎఫ్ (జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్) గా సెలక్ట్ అయ్యారు. ఉస్మానియా యూనివర్సిటీలో నీలా జంగయ్య కవిత్వం-సమగ్ర పరిశీలన అనే అంశం పైన వెలుదండ నిత్యానందరావు పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందారు. ఈ నెల 19న ఉస్మానియా యూనివర్సిటీలో జరుగనున్న 84వ స్నాతకోత్సవంలో డాక్టరేట్ తీసుకోబోతున్నారు ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు బామండ్ల రాజును అభినందించారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వ ప్రాధాన్యత

చేర్యాల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని చేర్యాల మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు అన్నారు. చేర్యాల పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందినవలువురు లబ్ధిదారు లకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.4.82లక్షల విలువైన చెక్కులను బుధవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావరణలో పంపిణీ చేశారు.


నంగునూరులో మాట్లాడుతున్న డీపీవో దేవకీదేవి

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: డీపీవో

నంగునూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన ప్రతి ఒక్కరికీ మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా పంచాయతీరాజ్ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ దేవకీదేవి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం నంగునూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజా పాలనలో దరఖాస్తుల ఆధారంగానే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మండలానికి 694 మంజూరైనట్లు లాగిన్ లో చూపిస్తున్నప్పటికీ కేవలం మొదటి విడతలో 512 ఇండ్లు మాత్రమే వచ్చినట్లు తెలిపారు. మొదటి విడతలో ఇల్లు రానివారు ఆధైర్యపడవద్దని సూచించారు. పాలమాకుల గ్రామంలో ఒక యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం సరికాదన్నారు. అతడి తల్లి బిచ్చవ్వ పేరు మీద దరఖాస్తు చేసుకున్నప్పటికీ రెండో విడతలో ఇచ్చేందుకు పరిశీలిస్తున్నట్లు ఆమె తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీవో లక్ష్మప్ప, ఏఈ వివేక్ పాల్గొన్నారు.

సిద్దిపేటలో అభివృద్ధిని పరిశీలించిన నర్సాపూర్ మున్సిపల్ అధికారులు

సిద్దిపేట ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలో జరిగిన అభివృద్ధి భేష్ అని నర్సాపూర్ కమిషనర్ రామ్‌చరణ్‌రెడ్డి కొనియాడారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ పరిధిలో జరిగిన అభివృద్ధిని నర్సాపూర్ మున్సిపల్ అధికారులు సందర్శించి పరిశీలించారు. మొదటగా పట్టణంలోని స్వచ్ఛ బడిలో, డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్ (డీఆర్‌సీసీ), బుస్సాపూర్ రిసోర్స్ పార్కును సందర్శించారు. పట్టణంలో ఇంటింటా వేలువేసే తడి చెత్త ద్వారా తయారవుతున్న సేంద్రియ ఎరువును తయారీ విధానాన్ని పరిశీలించారు. అన్ని హంగులతో నిర్మించిన స్వచ్ఛబడిని సందర్శించారు. స్వచ్ఛబడి నిర్మాణంలో వ్యర్థాలతో రూపొందించిన ప్లాస్టిక్‌తో తయారైన బకెట్, టైల్స్‌ను పరిశీలించారు. పాత బొంగలు, సైకిల్ రిమ్‌లతో స్వచ్ఛ బడిలో నిర్మించిన ప్రహరీని పరిశీలించారు.

బీసీ బిల్లును సాధించి తీరుతాం


ఢిల్లీలో బీసీ ధర్నాలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ బిల్లును సాధించి తీరుతామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ తెలిపారు. బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న బీసీ ధర్నాలో కాంగ్రెస్‌పార్టీ సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ కులగణన చేసి బిల్లును వెంటనే అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రానికి బిల్లును పంపినప్పటికీ ప్రధాని బిల్లు ఆమోదించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో బీసీల పట్ల మోదీకి ఉన్న చిత్తశుద్ధి బిల్లు పాస్ చేయించి తీరుతామన్నారు. ఏది ఏమైనా ప్రధాని బీసీ బిల్లు పాస్ చేయించి తీరుతామన్నారు.

రెవెన్యూ డివిజన్ చేయాలని సీఎంకు వినతి



చేర్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణ కాంగ్రెస్ నాయకుడు, మునిసిపల్ 5వ వార్డు మాజీ కౌన్సిలర్ ఆడెపు నరేందర్ బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా చేర్యాల ప్రజల చిరకాల స్వప్నమైన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం ఆందోళనలు కొనసాగుతున్నాయని తెలిపారు. రెవెన్యూ డివిజన్‌తో ఆస్పత్రితో చేర్యాల పున:వైభవం సంతరించుకుని అభివృద్ధి చెందుతుందని, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోరిక నెరవేర్చాలని కోరారు.

కనుల పండువగా స్వామివారి కల్యాణం


దుబ్బాకలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, పట్టువస్త్రాలు, సారెను పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్తున్న పద్మశాలి, చేనేత కుటుంబాలు

దుబ్బాక, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): దుబ్బాకలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం లక్ష్మీ భూదేవి సహిత స్వామి వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి సతీసమేతంగా హాజరయ్యారు. పూజా కార్యక్రమంలో భాగంగా పద్మావతి పట్టణ ఆడబిడ్డల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి పట్టువస్త్రాలు, కళ్యాణ వస్త్రాలు, పూలు, తలంబ్రాలు, ఒడి బియ్యం ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. పద్మశాలీ, చేనేత కుటుంబాల చిన్నారులు వివిధ వేషధారణలతో, మేళతాళాలతో పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కల్యాణోత్సవంలో రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య దంపతులు పాల్గొన్నారు. సుమారు 15వందల మంది దంపతులు, 2వేల మంది అవివాహితులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో రథయాత్ర

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషిమాత ఆలయ 39వ వార్షికోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా విశేష అలంకరణల్లో అమ్మవారు దర్శనమి


సిద్దిపేటలో అమ్మవారి రథయాత్ర


కొండపాక: మర్పడగలో విజయదుర్గాదేవికి కుంకుమార్చన చేస్తున్న మహిళలు

చ్చారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు అమ్మవారికి రథయాత్ర నిర్వహించారు. భక్తి గీతాలతో పట్టణ పురవీధుల గుండా అమ్మవారి రథయాత్ర కొనసాగింది.

మర్పడగ విజయదుర్గాదేవికి సారె

కొండపాక, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ విజయదుర్గా మాతకు మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో బుధవారం సారె సమర్పించారు. ఉదయం 10 గంటలకు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభం కాగా విజయదుర్గా మాత కుంకుమార్చనలు నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు, లలిత సహస్రనామ పారాయణము జరిగాయి.

సోలార్ పవరే.. సో బెటర్

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నారు. ఇప్పటి వరకు మున్సిపల్ తరుపున ఉన్న పలు కార్యాలయాల్లో విద్యుత్ బిల్లుల పై సర్వే నిర్వహించగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేందుకు వీలుగా మున్సిపల్ ఆ దిశగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 49,708 చదరపు మీటర్లలో సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల చివరిలోగా లేదా సెప్టెంబరు మొదటి వారంలో సోలార్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు కృషి చేస్తున్నారు.

సోలార్‌ను మరింత విస్తరిస్తాం...



సిద్దిపేట పట్టణ ప్రజల కోసం అందిస్తున్న తాగునీరు, వీధి దీపాలు తదితర వాటికి విద్యుత్ బిల్లుల చెల్లింపుల సమస్య భారంగా మారింది. విద్యుత్ బిల్లులు తగ్గించాలని అందుకు సోలార్ సిస్టమ్ ఉత్తమమని భావించి ఏర్పాటు చేస్తున్నాం. రూ.79.20 లక్షలతో, 95 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగితే బిల్లుల భారం కొంత మేరకు తగ్గుతుంది. అలాగే సోలార్ సిస్టమ్‌ను మరింత విస్తరిస్తాం.

- ఆశ్రిత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, సిద్దిపేట